అదంతా ఒక్కసారి కళ్ళముందు కన్పించింది.

మహాపాత్రోకి ఆ వేళ ఉదయం జ్ఞాపకానికొచ్చింది. ఆ వేళ ఉదయం తనింకా లేవలేదు. చంప టీ తీసుకొచ్చి తట్టి లేపింది. కళ్ళిప్పాడు.

కళ్ళతోనే పలకరించింది. టీ కప్పుని అతని చేతికిచ్చి వారగా కూర్చుంది. టీ తాగుతూ చిలిపిగా ఆమెకేసి చూశాడు.

"అయ్యగారు ఆశయాల్లోనే కాదు...ఆచరణలోనూ గొప్పవారే"...

"ఏవిటట...?"

"వార్త చూడండి.." అది ఆవేల్టి దినపత్రిక. అతనిచేతికిచ్చింది. మహాపాత్రో చూశాడు.

'బాక్సుకట్టి ఫ్రంట్ పేజీలో వేశారే!? ఆశ్చర్యంగా పెళ్ళాంవేపు చూశాడు.

"వాళ్ళకి ఇప్పటికైనా బుద్ధొస్తుంది లెండి..." అనేసి టీ కప్పు తీసుకుని లేచి లోపలి గదిలోకి వెళ్ళిపోయింది చంప.

చాలాసేపు అలా పేపరు చూస్తూ వుండిపోయాడు.

దూరంగా ఋషికుల్ నది. ఒడ్డున పడవలు సర్దుతున్న జాలరివాళ్ళ కేకలు విన్పించటం లేదు. కానీ వాళ్ళ వురుకులూ, పరుగులూ కనబడుతున్నాయి.

వూరి మధ్యవున్న దేవాలయంలో మోగుతున్న గుడిగంటలు లయగా విన్పిస్తున్నాయి.

"వేగిరం స్నానం చెయ్యండి, గుడికెళ్దాం.." మాటాడకుండా లేచాడు మహాపాత్రో.తయారయేసరికి అరగంట పట్టింది.

తల దువ్వుకుంటూ ఆమెవేపు చూశాడు.

సన్నగా, పొడవుగా వుంటుంది చంప. చంపకి చేరడేసి కళ్ళున్నాయి. ఆ కళ్ళ వేపు చూస్తున్నప్పుడల్లా ఎందుకో కమల్ సాహూ జ్ఞాపకానికొస్తాడు. సాహూ చంప తొలి భర్త.

ఎందుకో మహాపాత్రోకి తను మొట్టమొదట ఆ వూరొచ్చిన కొత్తలో తనని ఆదరించిన మధు చక్రవర్తి గుర్తుకొచ్చాడు.

మధు చక్రవర్తి!

తనకో మంచి స్నేహితుడు. తనకి కాలేజీ చదువులో ఆదుకుని ఆ మాత్రం దారి చూపించిన మధు.

ఆ వేళ బజార్లో కలిశాడు.

